సాక్షి
మహబూబ్‌నగర్
శుక్రవారం ¦ 1 ¦ సెప్టెంబర్ ¦ 2023



వడివడిగా మార్కండేయ

రూ.75కోట్లతో జరుగుతున్న మార్కండేయ పనులు వేగంగా సాగుతున్నాయి.

వివరాలు 8లో ▸



వాలీబాల్ అకాడమీ..

పాలమూరు స్టేడియంలో వాలీబాల్ అకాడమీ ప్రారంభానికి ముస్తాబవుతోంది.

వివరాలు 10లో ▸

వాతావరణం


గరిష్ఠం/కనిష్ఠం
35.3 /21.2

ఆకాశంలో కొంత మేర మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయంలో జల్లులు పడే అవకాశం ఉంది.

అసంతృప్తులకు గాలం?!

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పోటాపోటీ ప్రయత్నాలు

- 'కొల్లాపూర్'పై గులాబీ నజర్
- చింతల జగదీశ్వర్‌రావుతో మంతనాలు
- కల్వకుర్తి 'కారు'లో అసమ్మతులపై హస్తం దృష్టి
- ఎమ్మెల్సీ కసిరెడ్డితో టచ్‌లోకి టీపీసీసీ నేతలు
- తటస్థ నాయకులపైనా ఇరు పార్టీల కన్ను
- ఆసక్తికరంగా మారుతున్న రాజకీయాలు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్, బీజేపీలు ఇది వరకే సన్నాహాలు మొదలుపెట్టాయి. ఉమ్మడి పాలమూరులో బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలకే సీట్లు ఖరారు కాగా.. హస్తం, కమలానికి సంబంధించి అభ్యర్థుల ఎంపికపై కసరత్తు జరుగుతోంది. త్వరలో తొలి జాబితా విడుదల కానున్నట్లు తెలుస్తోంది. అయితే.. బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఖరారు, కాంగ్రెస్‌లో పలువురి నేతల చేరిక తర్వాత ఆయా పార్టీల్లో పలు నియోజకవర్గాల పరిధిలో అసమ్మతి సెగలు ఎగిసిపడుతున్నాయి. ఈ క్రమంలో అసంతృప్తిగా ఉన్న కీలక నాయకులకు గాలం వేసేందుకు ఇరు పార్టీలు పోటాపోటీ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు పలు సెగ్మెంట్లలో తటస్థంగా ఉన్న నేతలపైనా నజర్ వేసి.. పార్టీలో చేరాలని ఆహ్వానిస్తుండడంతో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి.

పోటాపోటీగా..

కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ప్రకటించిన తర్వాత ఆయా పార్టీల్లో రాజుకునే అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకునేలా గులాబీ నేతలు స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. నారాయణపేట జిల్లా మక్తల్‌లో కాంగ్రెస్ నుంచి సుమారు ఆరుగురు, మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం నుంచి నలుగురు ఆశావహులు పోటీపడుతున్నారు. ఇందులో ముఖ్యులను కారెక్కించుకునేందుకు బీఆర్‌ఎస్ నేతలు ప్లాన్ చేసినట్లు సమాచారం. మరోవైపు దేవరకద్ర సెగ్మెంట్‌లో గతంలో ఎన్నికల్లో పోటీచేసి.. ఆ తర్వాత బీజేపీలో చేరిన ఓ నేతను కాంగ్రెస్‌లోకి తీసుకొచ్చేందుకు టీపీసీసీ నేతలు యత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

'చేయి' అందుకోవాలని కసిరెడ్డికి..

కల్వకుర్తి నియోజకవర్గానికి సంబంధించి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి మధ్య విభేదాలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఇద్దరు బీఆర్‌ఎస్ పార్టీకే చెందిన వారు కాగా.. ఈ సారి టికెట్ కోసం నారాయణరెడ్డి తీవ్రంగా ప్రయత్నించారు. అయితే పార్టీ అధిష్టానం జైపాల్‌యాదవ్‌కే టికెట్ ఖరారు చేయగా.. కసిరెడ్డి వర్గీయుల్లో అసంతృప్తి నెలకొంది. సర్వేలో తమకే మొగ్గు ఉందని.. పోటీ చేయాలని ఆయనపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో టీపీసీసీ పెద్దలు కసిరెడ్డిని సంప్రదించినట్లు తెలుస్తోంది. ఆయనతో సన్నిహితులుగా ఉన్న కాంగ్రెస్‌కు చెందిన నేతలు హైదరాబాద్‌లో భేటీ అయి పార్టీలోకి ఆహ్వానించినట్లు సమాచారం. అయితే నారాయణరెడ్డి సమాధానం దాటవేసినట్లు తెలుస్తుంది. సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రి కేటీఆర్‌తో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అసంతృప్తిగా ఉన్నప్పటికీ.. కేటీఆర్ అమెరికా నుంచి వచ్చిన తర్వాత ఆయనను కలిసి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు కసిరెడ్డి అనుచరులు భావిస్తున్నారు. మరోవైపు జైపాల్ యాదవ్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న బీఆర్‌ఎస్‌లోని ముఖ్యమైన మిగతా అసమ్మతి నాయకులకు గాలం వేసే పనిలో కాంగ్రెస్ నిమగ్నమైనట్లు వినికిడి.

అదేవిధంగా తటస్థ నేతలపైనా దృష్టి సారించిన కాంగ్రెస్ నేతలు మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డితో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. అనుచరులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని చెప్పిన ఆమె.. ఆ పార్టీలో చేరేందుకు సన్నాహాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది.

జగదీశ్వర్‌రావుకు బీఆర్‌ఎస్ ఆహ్వానం..

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌లో ప్రస్తుతం అనిశ్చితి కొనసాగుతోంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుపై కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన బీరం హర్షవర్ధన్ రెడ్డి గెలుపొందారు. ఈ ఎన్నికల్లో బీరం గెలుపు కోసం చింతల జగదీశ్వర్‌రావు పనిచేశారు. కాంగ్రెస్‌లో ఉంటే తనకు టికెట్ రాదనే ఉద్దేశంతో ఆయన బీఆర్‌ఎస్‌లో చేరారు. కానీ రాజకీయ పరిణామాల క్రమంలో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి గులాబీ చెంతకు చేరడంతో జగదీశ్వర్‌రావు మళ్లీ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బీఆర్‌ఎస్ (అప్పటి టీఆర్‌ఎస్) ఎన్‌ఆర్‌ఐ విభాగంలో పనిచేసిన రంగినేని అభిలాష్‌రావు కూడా చేయి అందుకున్నారు. వీరి మధ్య అంతర్గత విభేదాలు ఉండగా.. ఎవరికి వారు సొంతంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించారు. ఇంతలో జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్‌లో చేరడం చిచ్చు రేపింది. సీటు గ్యారెంటీతోనే ఆయన పార్టీలో చేరినట్లు భావిస్తుండగా.. తనకే సీటు ఖరారు చేస్తారని చింతల ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. జగదీశ్వర్‌రావు రాకతో బీరం గెలుపు సులువైతుందనే కారణంతో బీఆర్‌ఎస్ పెద్దలు ఆయనను పార్టీలోకి చేర్చుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. జగదీశ్వర్‌రావు సామాజికవర్గానికి చెందిన, సీఎం కేసీఆర్‌కు సన్నిహితులైన ఉత్తర తెలంగాణలోని ఓ ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఓ మంత్రి, పక్క జిల్లాకు చెందిన మరొక నేత రంగంలోకి దిగి ఆయనతో మంతనాలు చేసినట్లు వినికిడి. ఎమ్మెల్సీ లేదా రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టు ఇచ్చే ప్రతిపాదనను చింతల ముందు పెట్టినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. జగదీశ్వర్‌రావుతో చర్చలు కొనసాగుతున్న క్రమంలో అభిలాష్‌రావు బీఆర్‌ఎస్‌లో చేరడం చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాలకు సంబంధించి జగదీశ్వర్ రావును 'సాక్షి' సంప్రదించగా.. 'పార్టీ మారే ప్రసక్తే లేదు.. కాంగ్రెస్ టికెట్ నాకే వస్తుంది.. నేను బరిలో ఉంటా.. నన్నెవరూ సంప్రదించలేదు' అని సమాధానమిచ్చారు.

ఎస్‌జీఎఫ్‌లో 16 క్రీడలు

- మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ టోర్నీలు
- జిల్లాస్థాయిలో 13 క్రీడాంశాల్లో నేరుగా ఎంపికలు
- అక్టోబర్‌లో ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలు

మహబూబ్‌నగర్ క్రీడలు: మూడేళ్ల తర్వాత స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కరోనా మహమ్మారి వల్ల 2020 నుంచి ఎలాంటి క్రీడా ఎంపికలు, టోర్నమెంట్లు నిర్వహించలేదు. దీంతో పాఠశాల, కళాశాల విద్యార్థులు క్రీడలకు దూరమయ్యారు. పాఠశాల, కళాశాల స్థాయిలో అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో బాలబాలికలకు క్రీడల్లో ప్రోత్సహించడం కోసం జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో క్రీడాపోటీలు నిర్వహించేందుకు ఎస్‌జీఎఫ్‌కు మార్గం సుగమమైంది. త్వరలోనే క్రీడల సందడి ప్రారంభం కానుంది.

■ మండల, జిల్లాస్థాయి, జోనల్ (ఉమ్మడి జిల్లా) స్థాయిల్లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. 16 క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి. మొదటగా మండల స్థాయిలో సెప్టెంబర్ 10 వరకు, జిల్లాస్థాయిలో సెప్టెంబర్ రెండో, మూడో వారం, ఉమ్మడి జిల్లా (జోనల్) స్థాయిలో అక్టోబర్ మొదటి, రెండో వారంలో క్రీడలను నిర్వహించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నారు. మండలస్థాయిలో గ్రామీణ క్రీడలు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో టోర్నీ కమ్ సెలక్షన్స్ నిర్వహించనున్నారు. అక్కడ గెలుపొందిన జట్లు జిల్లాస్థాయి టోర్నీలో పాల్గొంటాయి. అదేవిధంగా బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, సాఫ్ట్‌బాల్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, హాకీ, క్రికెట్, అథ్లెటిక్స్, చెస్, నెట్‌బాల్, టెన్నికాయిట్, యోగా క్రీడాంశాల్లో నేరుగా జిల్లాస్థాయిలోనే ఎంపికలు నిర్వహించనున్నారు.

మండలస్థాయిలో క్రీడలను పూర్తి చేయాలి



మండల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలను సెప్టెంబర్ 10 వరకు పూర్తి చేయాలి. జిల్లాస్థాయి ఎంపికలకు వచ్చేటప్పుడు విద్యార్థులు ఆధార్ కార్డు, బోనఫైడ్‌తో ఎంపికలకు హాజరుకావాలి. రాష్ట్రస్థాయి టోర్నీలకు కోసం జిల్లా నుంచి పలు క్రీడా టోర్నీలకు ప్రతిపాదనలు పంపాం. టోర్నీలు కేటాయిస్తే పకడ్బందీగా నిర్వహిస్తాం. – రమేష్‌బాబు, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి, మహబూబ్‌నగర్



జిల్లాకేంద్రంలో జరిగిన ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ(ఫైల్)

జిల్లాస్థాయిలో పీఈటీల సమావేశం

జిల్లాస్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల నిర్వహణపై ఈ నెల 23వ తేదీన స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాల గాంధీ హాల్‌లో జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్ ఆధ్వర్యంలో జిల్లాలోని వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈ ఏడాది జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలపై డీఈఓ దిశానిర్దేశం చేశారు. క్రీడలను పకడ్బందీగా నిర్వహించాలని, రాష్ట్రస్థాయి టోర్నీలో జిల్లా విద్యార్థులు గెలుపొందేలా ప్రత్యేక శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో నిర్వహించే ఎస్‌జీఎఫ్ షెడ్యూల్‌ను విడుదల చేశారు.

న్యూస్‌రీల్

ముగిసిన సీఎఫ్‌బీ నమోదు ప్రక్రియ



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో భాగంగా చేపట్టిన సిటిజన్ ఫీడ్ బ్యాక్ (సీఎఫ్‌బీ) నమోదు ప్రక్రియ గురువారం ముగిసింది. గత నెల 1 నుంచి ఇప్పటివరకు మహబూబ్‌నగర్ పట్టణంలోని 81,478 మంది ప్రజలతో స్వచ్ఛత యాప్‌లో వారి అభిప్రాయాలను మున్సిపల్ సిబ్బంది నమోదు చేయించారు. చివరి రోజు రాత్రి వరకు జన సామర్థ్యం కలిగిన ప్రాంతాల్లో విస్తృతంగా తిరిగి ఈ కార్యక్రమం పూర్తి చేశారు. ముఖ్యంగా ఆస్పత్రులు, బస్టాండ్లు, పెట్రోల్ బంకుల్లో ప్రజల నుంచి పట్టణంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యంపై ఓటింగ్‌ను నమోదు చేయించారు.

నేడు జిల్లావ్యాప్తంగా మట్టి సేకరణ



పాలమూరు: ఢిల్లీలో నిర్మిస్తున్న అమరవీరుల స్మృతివనానికి దేశవ్యాప్తంగా మట్టి సేకరణ కార్యక్రమం కొనసాగుతుందని, దీనిలో భాగంగా శుక్రవారం రాష్ట్రంలో ఉన్న 119 నియోజకవర్గాల్లో ప్రతి మండలంలో ప్రతి గ్రామంలో 'మేరా మట్టి మేరా దేశ్' అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం కోసం అమరులైన సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవడానికి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరి లోపల దేశ భక్తి భావన పెంపొందించాలని ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. జిల్లాలో ప్రతి కార్యకర్త మట్టి సేకరణ కార్యక్రమం పాల్గొన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కృష్ణవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

■ జిల్లా బీజేపీ కార్యాలయంలో గురువారం రాఖీ పండుగ వేడుకలు నిర్వహించారు. బీజేపీ మహిళ నాయకురాలు, కార్యకర్తలు బీజేపీ జిల్లా నాయకులకు రాఖీలు కట్టారు.

ఆయకట్టు ప్రశ్నార్థకం



ఆర్డీఎస్ హెడ్‌వర్క్ వద్ద ప్రస్తుత పరిస్థితి..

- టీబీ చరిత్రలో తొలిసారిగా తీవ్రవర్షాభావ పరిస్థితులు
- అయిజ, వడ్డేపల్లి, రాజోలి మండలాల రైతులకు పెద్దదెబ్బ
- మన నీటి వాటా వచ్చే నెలలో విడుదల
- ఇప్పటికీ బీళ్లుగా దర్శనమిస్తున్న పొలాలు
- ఆందోళనలో ఆర్డీఎస్ ఆయకట్టుదారులు

గద్వాల రూరల్: కర్ణాటకలోని తుంగభద్ర డ్యాం నిర్మాణం పూర్తిచేసుకుని జాతికి అంకితం చేసిన 70 ఏళ్ల చరిత్రలో తొలిసారి తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. డ్యాం పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 105.788 కాగా ప్రస్తుతం 78 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇలాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ లేదని.. ఫలితంగా డ్యాం ద్వారా మనకు రావాల్సిన నీటివాటా హక్కు వినియోగించుకోలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఆర్డీఎస్ కింద ప్రతి ఏటా ఖరీఫ్‌లో సాగయ్యే 55 వేల ఎకరాల ఆయకట్టు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారగా.. ప్రభుత్వం ఆదుకోవాలంటూ అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

100 కిలోమీటర్ల మేర..

కర్ణాటక పరిధిలో నిర్మించిన ఆర్డీఎస్ నుంచి మనకు 17 టీఎంసీల నీటివాటా కేటాయించారు. ఆర్డీఎస్ ప్రధాన కాల్వ మొత్తం 142.6 కి.మీ., మేర విస్తరించి ఉంటే 0–42.6 కి.మీ., వరకు కర్ణాటక పరిధిలో.. మిగిలిన 100 కి.మీ., ప్రధాన కాల్వ తెలంగాణలోని అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ, వడ్డేపల్లి, రాజోళి, ఉండవెల్లి, మానవపాడు, అలంపూర్ మండలాల్లో విస్తరించి ఉంది.

87,500 ఎకరాల ఆయకట్టు..

ఆర్డీఎస్ కింద మన ప్రాంతంలో 87,500 ఎకరాల ఆయకట్టు స్థిరీకరించి ఉంది. ఇందుకోసం మొత్తం 17 టీఎంసీల నీటిని కేటాయించారు. ఇందులో 10 టీఎంసీలు నదీ ప్రవాహం నుంచి.. 5.9 టీఎంసీలు తుంగభద్ర డ్యాం నుంచి, 1.1 టీఎంసీలు కర్ణాటకలోని హెడ్‌వర్క్స్ నుంచి కేటాయించారు. అయితే ఈ నీటి వాటా సైతం మనకు అక్టోబర్ వరకే విడుదల చేయాలన్నది ఇరు రాష్ట్రాల మధ్య చేసుకున్న ఒప్పందం.

తుకాలు పోసుకుని నిరీక్షణ

ఏటా సాగునీటి పారుదల శాఖ అధికారులు ఖరీఫ్ సీజన్‌లో తుమ్మిళ్ల ఎత్తిపోతల కింద 55 వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నారు. ఈ ఏడాది కూడా రైతులు తుకాలు పోసుకుని వరినాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. ముఖ్యంగా అయిజ, వడ్డేపల్లి, రాజోళి మండలాల పరిధిలోని సుమారు 30 వేల ఎకరాలకు పైనే వరిపంట సాగు చేసేందుకు అవసరమైన వరిమడులను (తూకాలు) పోసుకుని రైతులు సిద్ధం చేసుకున్నారు. అలాగే మానవపాడు, ఉండవెల్లి, అలంపూర్ మండలాల పరిధిలోని రైతులు మరో 20 వేల ఎకరాలకు పైనే ఆరుతడి పంటలు వేసేందుకు అవసరమైన దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో ఆర్డీఎస్ కాల్వకు నీళ్లు రాకుండా పోవడంతో రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

70 ఏళ్ల చరిత్రలో..

తుంగభద్ర డ్యాం నిర్మించిన 70 ఏళ్ల చరిత్రలో ఇంతటి వర్షాభావ పరిస్థితులు తొలిసారిగా నమోదైనట్లు సాగునీటి పారుదల అధికారులు, నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే ఆగస్టు ముగిసి సెప్టెంబర్‌లోకి అడుగుపెట్టినా తుంగభద్ర డ్యాంలో 78 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. వాస్తవానికి వానాకాలంలో కురిసే భారీ వర్షాలకు తుంగభద్ర డ్యాం నిండిన అనంతరం అక్కడి సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకున్న అనంతరం మన ప్రాంతానికి అక్టోబర్‌లో కేటాయించిన నీటి వాటాను విడుదల చేస్తారు. అప్పటికీ డ్యాంలో 230 టీఎంసీలు నమోదు కావాల్సి ఉంది. అంటే ఇంకా 130 టీఎంసీలకు వరకు టీబీ డ్యాంకు చేరాలి.

టీబీ డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం	105.788 టీఎంసీలు
ప్రస్తుతం నీటిమట్టం	78 టీఎంసీలు
గతేడాది ఇదే సమయానికి ఉన్నది	103.74 టీఎంసీలు
ఆర్డీఎస్ కింద ఆయకట్టు	55 వేలు
మనకు కేటాయించిన నీటివాటా	17 టీఎంసీలు

తుకం ఎండిపోయింది..



ఆర్డీఎస్ డిస్టిబ్యూటరీ-25 కింద ఎకరా పొలం ఉంది. వరి పంట వేసుకునేందుకు తుకం పోసుకున్నాను. అయితే నీళ్లు రాకపోవడంతో పోసుకున్న తుకం కూడా పూర్తిగా ఎండిపోయింది. ఈసారి పంటపై ఆశలు వదులుకోవాల్సిందే.
– బోయ గోకారి, రైతు, కొంకల

గొర్రెలకు వదిలేశాం..



నాకు డిస్టిబ్యూటరీ-25 కింద మూడెకరాల పొలం ఉంది. వరిపంటకు అవసరమైన తుకం పోసుకున్నాను. కానీ, కాల్వకు నీళ్లు రాకపోవడంతో గొర్రెలు మేపుకొనేందుకు ఇచ్చాను. మమ్మల్ని ప్రభుత్వమే ఏదోలా ఆదుకోవాలి.
– బుచ్చన్న, రైతు, కొంకల

గతంలో ఎన్నడూ లేదు..



తుంగభద్ర చరిత్రలో ఎన్నడూ ఇలాంటి తీవ్ర వర్షాభావ పరిస్థితులు తలెత్తలేదు. ఇప్పటికే రైతులు తుకాలు పోసుకుని నష్టపోయారు. సాధారణంగా సెప్టెంబర్‌లో వర్షాలు కురుస్తాయనే ఆశతో ఉన్నాం. వర్షాలు సమృద్ధిగా కురిస్తే రైతులు రెండో పంట కింద ఆరుతడి పంటలు వేసుకునేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.
– సీతారామిరెడ్డి, ఆర్డీఎస్ మాజీ చైర్మన్

ప్రత్యామ్నాయంగా తుమ్మిళ్ల..

50 ఏళ్ల కిందటి వరకు ఆర్డీఎస్ కింద పూర్తిస్థాయిలో నీటివాటా మన ప్రాంతానికి వచ్చేది. కాలక్రమేణా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు నీటి వినియోగం పెరగడంతో నీటికి విపరీతమైన డిమాండ్ పెరిపోయి మనకు రావాల్సిన నీటిని సైతం ఏపీలోని కర్నూలు జిల్లా నాయకులు తరలించుకుపోవడంతో ఈ ప్రాంతంలోని ఆయకట్టు బీళ్లుగా మారాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం సంప్లిమెంటరీ విధానంతో ఆర్డీఎస్‌కు ప్రత్యామ్నాయంగా సుంకేసుల బ్యారేజీ వద్ద తుమ్మిళ్ల ఎత్తిపోతలు నిర్మించారు. దీని ద్వారా 55 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేలా ఎత్తిపోతలు రూపొందించారు.

ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం



పద్మశాలి సంఘం నాయకులకు నిధుల మంజూరు కాపీని అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో స్థానిక 15వ వార్డు పరిధిలోని చిన్నదర్‌పల్లి, చిర్మల్‌కుచ్చ తండాకు చెందిన సుమారు వంద మంది కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో పనిచేస్తే పార్టీలో ఎంతో భవిష్యత్ ఉంటుందన్నారు. వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలులో ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ తొమ్మిదిన్నర ఏళ్ల కాలంలో మహబూబ్‌నగర్ ఎంతో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. జిల్లాకు ఎన్నో కంపెనీలు వస్తున్నాయని, ఇక్కడే స్థానికంగా వేలాది మందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయ ఆలయ అభివృద్ధికి రూ.30 లక్షలు

అంతకుముందు అయ్యప్పకొండ సమీపంలోని మార్కండేయ ఆలయ అభివృద్ధికి రూ.30 లక్షలను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మంజూరు చేశారు. అందుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను జిల్లా పద్మశాలి సంఘం నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆయా చేతి, కుల వృత్తులకు పూర్వవైభవాన్ని తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం ప్రతినిధులు ప్రభాకర్, శంకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోతన్‌పల్లికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త శ్రీనివాస్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న సమాచారం తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి మంత్రి పరామర్శించారు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో శ్రీనివాస్‌రెడ్డిని చేర్పించి అవసరమైన వైద్యాన్ని అందిస్తామన్నారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం



అలంకరణలో స్వామివారి బృందావనం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని పరిమళగిరిపై వెలిసిన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో 352వ ఆరాధన ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పూర్వారాధన వేడుకలు వైభవంగా జరిగాయి. అత్యంత భక్తిశ్రద్ధల మధ్య వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, పాదపూజ, కనకాభిషేకం, వివిధ రకాల ఫలాలతో కూడిన ఫల పంచామృతాభిషేకం చేశారు. అర్చకులు స్వామి వారి బృందావనానికి అభిషేకం చేశారు. విష్ణుసహస్రనామ పారాయణం, రాఘవేంద్రస్వామి అష్టోత్తర పారాయణం చేపట్టారు. స్వామివారిని సుగంధ పుష్పాలతో అలంకరించారు. మధ్యాహ్నం 12 గంటలకు హస్తోదకం, మహామంగళహారతి నిర్వహించారు. ఆరాధన మహోత్సవాల్లో మేనేజర్ దివాన్‌జీ గురురాజాచార్యులు తదితరులు పాల్గొన్నారు. ఆరాధన ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మధ్యారాధన వేడుకలు నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

బైక్ బోల్తా.. ఒకరి మృతి

అడ్డాకుల: మూసాపేట మండలకేంద్రం లోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎస్ఐ కె.శ్రీనివాసులు కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన ఖాదరయ్య(46) గురువారం మూసాపేట మండలం వేములకు ద్విచక్రవాహనంపై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మూసాపేట స్టేజీ దాటిన తర్వాత రైస్‌మిల్లు ముందు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. గుర్తు తెలియని వాహనం తగలడంతో బైక్ అదుపు తప్పి రోడ్డుపై బోల్తాపడింది. దీంతో బైక్‌పై ఉన్న ఖాదరయ్య తలకు గాయాలై తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు క్షతగాత్రుడిని ఎల్అండ్‌టీ అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడే చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

బస్సులో నుంచి కిందపడి వ్యక్తి మృతి

ఎర్రవల్లిచౌరస్తా: ప్రమాదవశాత్తు బస్సులో నుంచి కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఇటిక్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ అశోక్ బాబు తెలిపిన వివరాలు ఇలా.. కేరళలోని అనాగంకు చెందిన ఓ బృందం బస్సులో విహారయాత్ర కోసం హైదరాబాద్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున బస్సును ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి పదవ బెటాలియం పెట్రోల్ బంక్‌లో డీజిల్ కోసం నిలిపారు. ఈ క్రమంలో మూత్ర విసర్జన కోసం తోటి మిత్రులతో కలిసి సురేష్ కుమార్ (58) బస్సులో నుంచి దిగుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయి పడిపోయాడు. ఈ క్రమంలో తలకు తీవ్ర గాయాలు కాగా, మిత్రులు వెంటనే అంబులెన్స్ ద్వారా గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు. మిత్రుడు మోహనన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని సంకలమద్ది అనుబంధ గ్రామమైన బంగ్లగడ్డకు చెందిన యువతి అదృశ్యం కావడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.శ్రీనివాసులు తెలిపారు. బంగ్లగడ్డకు చెందిన యువతి(19) బుధవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయిందని, కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి బాలయ్య గురువారం ఠాణాలో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయరహదారిపై ట్రాఫిక్ జామ్

జడ్చర్ల: పట్టణ కేంద్రం సమీపంలో 44వ నంబర్ జాతీయరహదారి గురువారం స్తంభించిపోయింది. హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు పవన విద్యుత్ ఉత్పత్తి తయారీకి సంబంధించిన ఫ్యాన్ భారీ రెక్కను తరలిస్తున్న లారీ సాంకేతిక సమస్యలతో రహదారిపై నిలిచి పోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దివిటిపల్లి వద్ద రైల్వేబ్రిడ్జి కారణంగా వన్‌వేగా ఉండడంతో దాదాపు 3 కి.మీ. మేరకు ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. తర్వాత నెమ్మదిగా వాహనాలు ముందుకు కదలడంతో ట్రాఫిక్ సమస్య క్రమంగా తగ్గింది.

కొండ చిలువ పట్టివేత

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల స్టేజీ వద్ద ఓ దాబా హోటల్‌లో ఉన్న భారీ కొండ చిలువను పట్టుకుని అడవిలో వదిలేసిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వేముల స్టేజీ వద్ద హనుమాన్ విగ్రహం ముందు బాలరాజు దాబా హోటల్‌ను నిర్వహిస్తూ అక్కడే నివాసముంటున్నాడు. గురువారం ఉదయం హోటల్‌లో ఫ్రీజ్ కింద కొండ చిలువ కనిపించింది. అక్కడున్న వారు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వేములకు చెందిన గణేష్‌నాయుడును పిలిపించారు. ఆయన వచ్చి కొండ చిలువను పట్టుకున్నాడు. కొండ చిలువ సుమారు 17 ఫీట్ల పొడవు ఉన్నట్లు తెలిపాడు. దీన్ని మహబూబ్‌నగర్ రూరల్ మండలం గాజులపేట సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలేసినట్లు గణేష్ చెప్పాడు.



వడివడిగా మార్కండేయ

రూ.76 కోట్లతో ప్రాజెక్టు పనులు ప్రారంభం



బిజినేపల్లి మండలం శాయిన్‌పల్లి వద్ద కొనసాగుతున్న పంప్‌హౌజ్ పనులు

- ఇప్పటికే పూర్తయిన పంప్‌హౌజ్, మరో నెలలో రిజర్వాయర్ పనులు పూర్తి
- వర్షాకాలం తరువాత డిస్ట్రిబ్యూటరీ కాల్వ పనులు ప్రారంభం
- పూర్తయితే బిజినేపల్లి మండలంలో 7 వేల ఎకరాలకు సాగునీరు

నాగర్‌కర్నూల్: కల్వకుర్తి ఎత్తిపోతల నీరు జిల్లాలో చాలా ప్రాంతాల్లో పారుతున్నా.. కొన్ని చోట్ల మాత్రం పంటలకు ఈ నీరు అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి ప్రాంతాల్లో బిజినేపల్లి మండంలో చాలా గ్రామాల్లో చాలా వరకు ఉన్నాయి. ఈ విషయాన్ని ఆ మండల ప్రజలు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా 2018లో జరిగిన ఎన్నికల సమయంలో నాగర్‌కర్నూల్ పర్యటనకు వచ్చిన సీఎం కేసీఆర్ చేత ప్రధానంగా హామీ ఇప్పించారు. మార్కండేయ పేరుతో ఇక్కడ రిజర్వాయర్ నిర్మించి సాగునీరు అందేలా చేస్తానని సభలో హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం 5 గ్రామ పంచాయతీలు, 17తండాలకు నీరు అందించేందుకు నిర్మించనున్న మార్కండేయ రిజర్వాయర్‌కు సంబంధించి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. మరో రెండు నెలల్లో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన రిజర్వాయర్, పంప్‌హౌజ్‌కు సంబంధించిన పనులను పూర్తి చేసి మొదట వీటిని కేఎల్ఐ నీటితో నింపనున్నారు.

మేలు జరిగే ప్రాంతాలు..

ఈ ప్రాజెక్టు పూర్తయితే బిజినేపల్లి మండలంలో దాదాపు 7,300 ఎకరాలకు సాగునీరు అందనుంది. ఇప్పటికే బిజినేపల్లి మండలంలో చాలా గ్రామాలకు నీరు అందుతుండగా.. ఎత్తైన ప్రాంతంలోని కొన్ని గ్రామాలకు, తండాలకు సాగునీరు అందడం లేదు. ప్రాజెక్టు పూర్తయితే.. మమ్మాయిపల్లి, లట్టుపల్లి, గంగారం, పోలెపల్లి, శాయిన్‌పల్లి, పెద్దతండా, వసురాంతండా, కీమ్యాతండా, కేతరబండ తండా, పెద్ద హేమ్లాతండా, అలుగుతండా, ఎర్రకుంటతండా, బద్యాతండా, రావుల చెరువుతండా, ఇప్పలతండా, బొడుసుగడ్డ తండా, చిన్నపీరు తండా, పూల్‌సింగ్‌తండా, హీర్యాతండా, భీముడి తండా, నేలగడ్డతండా, శాయిన్‌పల్లి తండాలకు సాగునీరు అందనుంది. వీటితో పాటు వనపర్తి జిల్లా పరిధిలోని పలు గ్రామాలు, తండాలకు నీరు అందనుంది. ఈ రిజర్వాయర్ పూర్తయితే నాగర్‌కర్నూల్ నియోజకవర్గం మొత్తం కేఎల్ఐ నీటితో పంటలు సాగయినట్టవుతుంది.

దాదాపు పనులు పూర్తి



మార్కండేయ ప్రాజెక్టుకు సంబంధించి పంప్‌హౌజ్, రిజర్వాయర్ పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయి. మరో నెలరోజుల్లో పూర్తి స్థాయిలో పనులు పూర్తవుతాయి. వర్షాకాలం తరువాత డిస్ట్రిబ్యూటరీ కాల్వల పనులను ప్రారంభిస్తాం. బోపాల్‌లో మోటార్ల పని తీరును కూడా పరిశీలించారు. ఈ నెలాఖరులోగా మోటార్లు, పంపులు ప్రాజెక్టు వద్దకు వస్తాయి.

– సత్యనారాయణరెడ్డి, ఎస్ఈ

ప్రాజెక్టు స్వరూపం ఇలా..

రూ.76 కోట్లతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేఎల్ఐ 29వ ప్యాకేజీకి అనుసంధానంగా ఈ ప్రాజెక్టును నిర్మించనున్నారు. ఇప్పటికే బిజినేపల్లి మండలం శాయిన్‌పల్లి వద్ద పంప్‌హౌజ్ నిర్మాణ పనులు పూర్తవగా.. గంగారం వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులు 95 శాతం పూర్తయ్యాయి. శాయిన్‌పల్లి వద్ద ఉన్న కేఎల్ఐ కాల్వ నుంచి రెండు కిలోమీటర్ల మేర పైప్‌లైన్ ద్వారా నీటిని తీసుకెళ్లి గంగారం వద్ద ఒక పంప్‌హౌజ్‌ను నిర్మించనున్నారు. ఇక్కడి నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తరలించి డిస్ట్రిబ్యూటరీ కాల్వల ద్వారా పొలాలకు నీటిని అందించనున్నారు. ఈ నెలాఖరులో ఈ ప్రాజెక్టుకు సంబంధించి మోటార్లు, పంపులు కూడా నాగర్‌కర్నూల్‌కు చేరుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. భూ సేకరణకు సంబంధించి ఈ ప్రాజెక్టుకు మొత్తం 134.31 ఎకరాలను సేకరించాల్సి ఉండగా.. ప్రస్తుతం 24 ఎకరాలకు నిధులను మంజూరు చేశారు. మిగిలిన భూసేకరణ ప్రక్రియ వివిధ స్టేజిల్లో కొనసాగుతుంది.

సరిహద్దు చెక్ పోస్టులకు స్థలాల పరిశీలన



చెక్‌పోస్టు కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ రవి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రమేష్

అలంపూర్: త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు ప్రాంతలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసేందుకు జిల్లా అదనపు ఎస్పీ ఎస్.రవి గురువారం స్థలాలను పరిశీలించారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ వెంకటేశ్వర్లుతో కలిసి సమీపంలోని ర్యాలంపాడు బ్రిడ్జి ప్రాంతాన్ని, జాతీయ రహదారి పుల్లూరు చెక్ పోస్టు సమీపంలో ఏర్పాటుచేసే ప్రత్యేక చెక్‌పోస్టుకు స్థలాన్ని ఏఎస్పీ పరిశీలించారు. చెక్ పోస్టులు ఏర్పాటు చేశాక ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేస్తామన్నారు. తనిఖీల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంపై స్థానిక పోలీస్ అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏఎస్పీ వెంట అలంపూర్, ఉండవెల్లి ఎస్ఐలు రమేష్‌బాబు, బాలరాజు ఉన్నారు.

మేకను చంపిన చిరుత



మేకను పరిశీలిస్తున్న సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు

అడ్డాకుల: మూసాపేట శివారులోని పెద్దగుట్ట సమీపంలో తుంకినీపూర్ రోడ్డు పక్కన గురువారం సాయంత్రం మేకను చిరుత పులి చంపేసింది. తుంకినీపూర్ చెందిన బొంగు శివకుమార్ తన మేకలను గుట్ట సమీపంలో మేపుతున్నాడు. గుట్ట దగ్గరలో మేస్తున్న ఓ మేకపై చిరుత దాడి చేసింది. ఆ సమయంలో మేక అరవడంతో శివకుమార్‌తో పాటు మేకలు కాస్తున్న మరో ఇద్దరు అటువైపుగా వెళ్లారు. పెద్దగా కేకలు వేస్తూ వెళ్లడంతో మేక పిల్ల గొంతును వదిలేసి చిరుత గుట్టపైకి వెళ్లినట్లు తుంకినీపూర్ సర్పంచ్ లక్ష్మణ్ తెలిపారు. అటవీశాఖ అధికారులకు సమా చారం చేరవడంతో సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు గ్రామస్తులతో కలిసి గుట్ట వద్దకు వెళ్లి పరిశీలించారు. చనిపోయిన మేక పిల్లను పరిశీలించి దాన్ని చంపిన జంతువు ఆధారాల కోసం ఆరా తీశారు. కాగా కొన్నాళ్ల నుంచి పెద్దగుట్ట, రామస్వామి గుట్ట పరిసరాల్లో చిరుత పులి సంచరిస్తోంది. రెండు నెలల తర్వాత మళ్లీ చిరుత మేకను చంపడంతో గుట్ట పరిసరాల్లోని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఓటీపీ చెప్పమన్నారు.. ఉన్నదంతా దోచేశారు

అచ్చంపేట రూరల్: గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీ చెప్పొద్దని బ్యాంకు వారు, పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా సైబర్ నేరగాళ్ల మాయ మాటలకు సామాన్య ప్రజలు బలవుతున్నారు. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఈ తరహాలోనే మోసపోయి నగదు పోయిందని ఆవేదన చెందుతున్నాడు. పటట్టణానికి చెందిన మంగళగిరి శివాజీ ఈనెల 25న ఆస్పత్రి వద్ద పని ఉందని హైదరాబాద్‌కు వెళ్లాడు. ఆ క్రమంలో తాము కస్టమర్ కేర్ మాట్లాడుతున్నామని ఫోన్ చేసి అజ్ఞాత వ్యక్తి చెప్పడం, ఫోన్ నంబర్ అప్‌డేట్ కోసం ఓటీపీ చెప్పాలని కోరారు. అలా మూడు పర్యాయాలు ఫోన్ చేయడం ఈ క్రమంలో ఆస్పత్రి వద్ద హడావుడిగా ఉన్న ఆ యువకుడు ఓటీపీ చెప్పాడు. కాసేపటికి తన బ్యాంకు ఖాతాలో రూ.99వేలు డెబిట్ అయినట్లు గుర్తించాడు. ఫోన్‌కు వచ్చిన నంబర్‌కు పలుమార్లు ఫోన్ చేసినా ఫలితం లేకపోయింది. దీంతో మోసపోయానని గ్రహించి గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రాజు తెలిపారు.

పెద్దాపూర్‌లో ఐదు ఇళ్లలో చోరీ

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్‌లో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఐదు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. గ్రామస్తులు, బాధితుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్ల కొసల్యమ్మ, లింగం సావిత్రి, బలిజ విజమ్మ, బొల్లంపల్లి వెంకటయ్య, బాల్‌రాజు ఇళ్లకు తాళాలు వేసి రాఖీ పండుగలకు వారివారి గ్రామాలకు వెళ్లారు. గురువారం తిరిగి ఇంటికి వచ్చే సరికి ఇళ్ల తాళాలు విరిగిపోవడంతో ఆందోళన చెందారు. బీరువాలు ధ్వంసం చేసి చోరీకి పాల్పడినట్లు బాధితులు పేర్కొన్నారు. నగదు, బంగారు, వెండి అభరణలు చోరీ అయ్యాయి. ఈ విషయంపై ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు పేర్కొన్నారు.

ధ్వంసమైన బీరువా →



వరిలో కాలిబాటలు - ప్రయోజనాలు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: విత్తనాలను వెద జల్లినా, డ్రమ్ సీడర్‌తో వెద పెట్టినా.. పొలంలో కాలిబాటలు తీయటం మాత్రం మరవరాదని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు. వీటి కోసం రైతులు పైసా ఖర్చు చేయకపోయినా సాగులో ఎదురయ్యే జటిల సమస్యలకు పరిష్కారం చూపేందుకు కాలిబాట దోహదపడుతుందని చెబుతున్నారు. కాలి బాటలు తీసే విధానం, వాటి వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలు వివరించారు.



కాలిబాట పద్ధతిలో వేసిన వరి పైరు

కాలి బాటలో విత్తే పద్ధతి

- వరి నాట్లు వేసేటప్పుడు కాలిబాటలు వేయాలంటే ముందుగానే రెండు గట్ల మధ్య తాళ్లు లాగి ఆ ప్రదేశాన్ని వదిలేసి మొక్కలు నాటుకోవాలి.
- పొలంలో విత్తనాలను వెదజల్లిన రైతులు కూడా కాలిబాటలు తీసుకోవచ్చు. విత్తనాలు చల్లి 15 నుంచి 20 రోజుల్లోగా పైరు ఎదుగుతున్న సమయంలో మొక్కలను తొలగించి పక్కన నాటుకోవడం ద్వారా బాటలు తీయవచ్చు. ప్రతి 2 మీటర్లకు 20 సెంటీమీటర్ల వెడల్పులో మొక్కలు తొలగించాలి.
- డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేసేటప్పుడు ఒక వరుస వేయటం పూర్తయిన తర్వాత 20 సెంటీమీటర్ల స్థలాన్ని వదిలి మరో వరుసలో విత్తనాలు వేసుకుంటే బాటలు ఏర్పడతాయి.

నాట్లు పూర్తయ్యాక..

వరి నాట్లు వేసిన తర్వాత పొలంలో ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల వెడల్పున కాలిబాటలు వేయాలి. నాట్లు వేసిన 12 నుంచి 16 రోజుల్లో కాలి బాట తీయడం ఉత్తమం.

- మందపాటి తాడును చేసుకు అవతలి గట్టుకు ఒకరు, ఇవతలి గట్టుకు పట్టుకుని మరోకరు పట్టుకుని లాగాలి.
- ఆ తాడు చివర్లకు కట్టెను కట్టి గట్టు మీద గుచ్చాలి. ఆ తాడుకు 20సెం.మీ. దూరంలో సమాంతరంగా మరొక తాడును ఇదే పద్ధతిలో ఏర్పాటు చేయాలి. రెండు తాళ్ల మధ్య ఉన్న ప్రదేశంలో వచ్చిన మొక్కలను తొలగించి పైరు పలుచగా ఉన్నచోట ఆ మొక్కలను నాటుకోవచ్చు.

ఆమడదూరంలో చీడపీడలు

వరి దుబ్బలను ఆశించి పైరును నష్టం కలిగించే బూడిద రంగు దోమ, తెల్లదోమ, పచ్చ దీపపు పురుగులను సకాలంలో గుర్తించి వెంటనే సంరక్షణ చర్యలు చేపట్టేందుకు ఈ బాటలు ఉపయోగపడతాయి.

- కాలిబాటలు ఉంటే పొలం నుంచి ఎప్పటికప్పుడు మురుగు తొలగించడం సులువుగా ఉంటుంది.
- ఈ కారణంగా గొట్టాల పురుగు, నామ పురుగు ఉధృతి తగ్గుముఖం పడుతుంది.
- కాలిబాటల చివర్ల పంగల కర్రలు కడితే పక్షులు వాటిపైకి చేరి హానికారక కీటకాలను పట్టుకుని తినేస్తాయి.

ఉపయోగాలు

కాలిబాటల విధానం వలన వరి పైరుకు గాలి, వెలుతురు పుష్కలంగా అందుతాయి. కిరణ జన్య సంయోగక క్రియ బాగ జరుగుతుంది. మొక్కల్లో పత్ర హరితం అధికంగా ఉత్పత్తి అవుతుంది. పంటకు ఎంత నీరు అవసరమో అంత మేరకు ఎప్పటికప్పుడు బాటలు అందిస్తాయి. సాగు నేలలోని సేంద్రియ పదార్థాలు త్వరగా కుళ్లడానికి ఈ కాలి బాటలు దోహదపడుతాయి. మొక్కలకు పోషకాలను అందిస్తాయి.

- మంచి దిగుబడులు పొందేందుకు ఇవి ముఖ్య భూమిక పోషిస్తాయి. పైరు ఆరోగ్యవంతంగా పెరుగుతుంది.
- గాలి సమృద్ధిగా మొక్కకు సోకటంతో కావాల్సినంత ఆక్సిజన్‌ను పొందేందుకు మొక్కలకు పెద్దగా ఖర్చు కాదు.
- కాలిబాటల వలన కలుపు నివారణ పిచికారీలకు కూడా ఎంతో సులువు. ఎరువులను పొలమంతా సమానంగా వేయటం తేలిక. పొలమంత తిరిగి పైరు ఎదుగుదలను చూసుకునే అవకాశం ఉంటుంది.

ప్రజలను మభ్యపెడుతున్న బీఆర్ఎస్

- టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్



జిల్లాకేంద్రంలో తిరగబడుదాం-తరిమికొడుదాం కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: మాయమాటలతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతున్నదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం 'తిరగబడుదాం-తరిమికొడుదాం' కార్యక్రమం నిర్వహించారు. అశోక్‌టాకీస్ చౌరస్తా నుంచి క్లాక్‌టవర్‌కు నాయకులు పాదయాత్ర చేపట్టి దుకాణాల్లో ప్రజలను కలిసి కార్యక్రమం గురించి వివరించారు. ఈ సందర్భంగా కొత్వాల్ మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీఆర్ఎస్‌కు రానున్న ఎన్నికల్లో తరిమికొడుదామని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ రాజకీయాన్ని వ్యాపారంగా మార్చిందన్నారు. ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమన్నారు. కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాలు అభివృద్ధి చెందాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ వైపు ప్రజలు చూస్తున్నారని, రానున్న ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, నాయకులు ఎన్‌పీ వెంకటేశ్, బెక్కరి అనిత, సాయిబాబా, లక్ష్మణ్ యాదవ్, సిరాజ్ ఖాద్రీ, ఫయాజ్, అజ్మత్‌అలీ, ఫహీం, చంద్రశేఖర్, నాగరాజు, జహీర్, సల్మాన్, మల్లేష్, వెంకటయ్య, గంగిరెడ్డి పాల్గొన్నారు.

4న మెడికల్ కళాశాలలో ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు

పాలమూరు: మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు, జూనియర్ రెసిడెంట్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈనెల 4న మెడికల్ కళాశాలలో నిర్వహించే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ఇతర వివరాలకు www.gmcmbnr.org.in వెబ్‌సైట్‌లో చూడాలని పేర్కొన్నారు. ఈ నెల 4న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు.

నాసిరకంగా రేషన్ బియ్యం

గండేడ్: పేదలకు అందించే రేషన్‌బియ్యం నాసిరకంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని రేషన్ దుకాణానికి ఆగస్టు నెలలో వచ్చిన రేషన్ బియ్యం నాసిరకంగా ఉన్నాయంటూ మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు విలేకర్లకు సమాచారం అందించాడు. బియ్యం ఇంట్లో వండుకోగా ప్లాస్టిక్‌లా మారిందని తెలిపారు. అనుమానం వచ్చి అన్నాన్ని ముద్దచేసి ఎగరేస్తే కూడా మెతుకులు రాలకుండా గోడకు కొడితే బంతిలా వెనక్కి వస్తుందని చెప్పారు. ఇలాంటి అన్నంతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉన్నదని తెలిపారు. సంబంధిత అధికారులు పర్యవేక్షించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



ప్లాస్టిక్‌ను తలపించేలా అన్నం ముద్దలు

రొయ్యల పెంపకం లేనట్లే

జిల్లాలో ముందుకు రాని మత్స్యకారులు

- రెండేళ్ల క్రితమే ప్రయోగాత్మకంగా 2 లక్షలు వదిలివేత
- సక్సెస్ కాకపోవడంతో నిలిపివేసిన అధికారులు
- ఎదుగుదల కాలం, చిన్నపాటి చెరువుల్లో నీరు లేకపోవడంతో ఇబ్బందులు
- గతంలో వదిలిన వాటి లెక్కలు చూపించని అధికారులు



నాగర్‌కర్నూల్: రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి పెద్దపీట వేయడంతోపాటు.. చేపలు పట్టుకుని జీవనం సాగించే వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో అన్ని రకాలుగా సహకారం అందిస్తోంది. ఈ క్రమంలో చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో చేప పిల్లలను పెంచడమే కాకుండా వాటిని పట్టుకుని అమ్ముకునేందుకు మత్స్యకారులకు వలలను పంపిణీ చేయడమే కాకుండా.. మార్కెటింగ్ చేసుకునేందుకు వాహనాలను సైతం ఇప్పటికే అందించింది. అయితే ఈ మత్స్యకారులకు మరింత లబ్ధి చేకూర్చేందుకు రొయ్యల పెంపకానికి సైతం శ్రీకారం చేట్టింది. కానీ, దీనిపై దృష్టిసారించకపోవడంతో రొయ్యల పెంపకం జిల్లాలో సాధ్యపడేలా లేదు.

రెండు రిజర్వాయర్లలో..

జిల్లాలోని జొన్నలబొగుడ రిజర్వాయర్, సింగోటం వద్ద ఉన్న శ్రీవారి సముద్రంలో మొదటిసారిగా రొయ్యలను పెంచేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు రెండు సంవత్సరాల క్రితమే 2 లక్షల రొయ్యలను వదలడం జరిగింది. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ పథకం విజయవంతమైతే మత్స్యకారులకు మరింత మేలు జరిగే అవకాశం ఉండేది. సాధారణ రకాల చేపల విలువ మార్కెట్‌లో రూ.100 నుంచి రూ.150 పలికితే రొయ్యల విలువ మార్కెట్‌లో కిలో రూ.400 నుంచి రూ.500 వరకు పలుకుతుంది. అంతేకాకుండా రొయ్యలు ఎదగడానికి దాదాపు 7 నుంచి 8 నెలల సమయం పడుతుంది. దీనికి తోడు చిన్నపాటి చెరువుల్లో ఎక్కువకాలం నీటిమట్టం నిలకడగా ఉండకపోవడం, ఒకవేళ నీటిమట్టం తగ్గితే రొయ్యలను చేపలు తినే ప్రమాదం ఉంటుంది. ఈ నేపథ్యంలో నీరు ఎప్పటికీ సమృద్ధిగా ఉండే రిజర్వాయర్లలో మాత్రమే వీటిని పెంచుతారు. ఇంత వరకు బాగానే ఉన్నా రెండు సంవత్సరాల క్రితం వదిలిన రొయ్యలకు సంబంధించి ఇప్పటి వరకు స్పష్టత లేదు. కనీసం ఎన్ని రొయ్యలు పట్టారు.. మత్స్యకారులకు ఎంత లాభం వచ్చిందనే విషయాలకు సంబంధించి కూడా అధికారుల వద్ద ఎలాంటి లెక్కలు లేవు.

శిక్షణ కరువు..

సాధారణ చేపలతో పోలిస్తే రొయ్యలపై లాభం కూడా అదే స్థాయిలో ఉంటుంది. అయితే సాధారణ చేపపిల్లలను పట్టే వలతో కాకుండా దీనికి ప్రత్యేకంగా బుట్లు అవసరం ఉంటుందని మత్స్యకారులు చెబుతున్నారు. రిజర్వాయర్లలో నీటి అట్టడుగున ఉండే ఈ రొయ్యలను పట్టాలంటే నీటిమట్టం గణనీయంగా తగ్గాల్సి ఉంటుంది. రొయ్యలను పట్టేందుకు ప్రత్యేకమైన బుట్టలను వినియోగించడంతో పాటు, వీటిని పట్టేందుక ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, ఇప్పటి వరకు జిల్లాలో రొయ్యలు పట్టుకునేందుకు శిక్షణ ఇచ్చిన దాఖలాలు ఎక్కడా కనబడటం లేదు.

ముందుకు వస్తేనే..



జిల్లాలో రెండు సంవత్సరాల క్రితం 2 లక్షల రొయ్య పిల్లలను ప్రయోగాత్మకంగా రిజర్వాయర్‌లలో వదలడం జరిగింది. కానీ, జిల్లాలో మత్స్యకారులు వీటి పెంపకానికి ముందుకు రావడం లేదు. మత్స్యకారులు ఆసక్తి చూపిస్తే రొయ్యలను పెంచడానికి ఇబ్బంది లేదు. రొయ్యలను పట్టేందుకు శిక్షణ కూడా ఇప్పిస్తాం.

– లక్ష్మప్ప, జిల్లా మత్స్యశాఖ అధికారి

ఆర్థికంగా నష్టపోతున్నారు..



మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సభ్యులకు ప్రభుత్వం తరఫున శిక్షణ తరగతులు అవసరం ఉన్నాయి. ప్రభుత్వం చేప పిల్లలు ఇచ్చి చేతులు దులుపుకోవడంతో వృత్తిపరమైన నైపుణ్యం ఉన్నప్పటికీ శిక్షణ లేని మత్స్యకారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం రొయ్యలను పట్టడంలో శిక్షణ తరగతులు ఇచ్చి.. పెంచినట్లయితే మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించడానికి అవకాశం ఉంటుంది.

– అల్లోజి, మత్స్య కార్మిక సంఘం డైరెక్టర్, నాగర్‌కర్నూల్

క్లుప్తంగా...


మొక్కుబడిగా 'స్థానిక' ధ్రువీకరణ పత్రాలిస్తారా?

- తహసీల్దార్ల తీరు ఆక్షేపణీయమన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్య (ఎంబీబీఎస్, బీడీఎస్) అడ్మిషన్ల భర్తీ కోసం 'స్థానిక' ధ్రువీకరణ పత్రాల జారీలో తహసీల్దార్ల తీరు ఆక్షేపణీయమని హైకోర్టు వ్యాఖ్యానించింది. స్థానికత ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థి తెలంగాణకు చెందిన వారో.. కాదో విచారణ చేసి సర్టిఫికెట్ ఇవ్వాలి తప్ప, మొక్కుబడిగా ఇస్తే ఎలాగని ప్రశ్నించింది. ఈ విషయంలో తహసీల్దార్లకు తగిన సూచనలు చేయాలని అడ్వొకేట్ జనరల్ (ఏజీ)కు చెప్పింది. ఇతర రాష్ట్రాల్లో చదివి తిరిగి తెలంగాణకు వచ్చిన విద్యార్థులకు 'స్థానిక' ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారని, ఇందులో ఫలానా చోట రెండేళ్లుగా నివాసం ఉంటున్నారని మాత్రమే జారీ చేయడంతో వాటిని కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ఆమోదించడం లేదని పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తెచ్చిన వైద్య విద్య అడ్మిషన్ల నిబంధనల కారణంగా తెలంగాణకు చెందిన వారైనప్పటికీ సీట్లు కోల్పోతున్నారని, తల్లిదండ్రుల ఉద్యోగ, ఇతర కారణాలతో ఒకట్రెండేళ్లు పక్క రాష్ట్రాల్లో చదువుకున్న వారికి స్థానిక కోటా కింద సీటు నిరాకరించడం తగదని ఇటీవల సీజే ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకుంటే.. ఎటూ తేల్చని విధంగా ఇస్తున్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాది చెప్పారు. దీంతో స్థానికతపై స్పష్టత ఇస్తూ సర్టిఫికెట్లు జారీ చేయాలని హైకోర్టు ఆదేశించింది.

సంక్షేమంపై ఖర్చు.. భవిష్యత్తు నిర్మాణమే

- 'సాక్షి'ఇంటర్వ్యూలో విఖ్యాత జర్నలిస్టు పాలగుమ్మి సాయినాథ్
- సంక్షేమంపై అంత వ్యయం ఎందుకనే వారికి ఐదేళ్లలో ఫలితాలు అర్థమవుతాయి
- అభివృద్ధికి అసలైన నిర్వచనం మానవాభివృద్ధి.. ఏపీ రోల్ మోడల్‌గా నిలుస్తుంది
- ఆకలి, అనారోగ్యం లేని జనాభాను నిర్మించడమే నిజమైన అభివృద్ధికి నిదర్శనం
- రైతులపై ఒత్తిడి తగ్గించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చర్యలు బాగున్నాయి



(ఎం.విశ్వనాథరెడ్డి, సాక్షి ప్రతినిధి)

పరిచయం అక్కర్లేని విఖ్యాత జర్నలిస్టు.. పాలగుమ్మి సాయినాథ్! గ్రామీణ అంశాలపై ఎన్నో విస్తృత కథనాలు రాసిన అనుభవం ఆయనది. పేదరిక నిర్మూలన, ఆకలి లేని సమాజం నిర్మాణం, పేదలకు మెరుగైన ఉపాధి కల్పన, వ్యవసాయ సంక్షోభ నివారణకు మార్గాన్వేషణ, మహిళా సాధికారత లక్ష్యంగా కృషి చేశారు. ఆసియా నోబెల్‌గా భావించే రామన్ మెగసెసే అవార్డు గ్రహీత. ఇక ఆయనకు లభించిన గౌరవ డాక్టరేట్లకు కొదవే లేదు. ఇటీవల విజయవాడ వచ్చిన పాలగుమ్మి సాయినాథ్ 'సాక్షి'కి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖ్యాంశాలు ఇవీ.. **సంక్షేమాన్ని అపహాస్యం చేసే వాళ్లు చరిత్రంతా కనపడతారు..**

సంక్షేమంపై ఎక్కువ ఖర్చు పెట్టడానికి నేను అనుకూలం. సంక్షేమ కార్యక్రమాల ప్రస్తావన రాగానే ఒక వర్గం ఎగతాళిగా చూడటం, మాట్లాడటాన్ని చరిత్రలో చాలాసార్లు చూశాం. ఎంజీ రామచంద్రన్ తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టారు. అప్పుడు చాలా మంది ఎగతాళిగా మాట్లాడారు. నాలుగేళ్ల తర్వాత మధ్యాహ్న భోజన పథకానికి తమిళనాడు గ్లోబల్ రోల్ మోడల్ అని యూనిసెఫ్ ప్రశంసించింది. దశాబ్దం తిరగక ముందే దేశంలోని అన్ని రాష్ట్రాలు స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేశాయి. మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత మెరుగుపరిచి విస్తరించాల్సిన అవసరం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ఆ ప్రయత్నం జరగడం సంతోషం. భోజనం చేసే పిల్లలంతా మన పిల్లలనే భావన పాలకులకు ఉండాలి.

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ వంతు..

మధ్యాహ్న భోజన పథకం ప్రారంభంలో ఎలా అపహాస్యానికి గురైందో ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ కూడా అంతే. సంక్షేమం మీద ఎక్కువ ఖర్చు పెడుతున్నారని వాపోతున్న వారికి కొన్నేళ్ల తర్వాత ఈ రాష్ట్రం.. 'హ్యూమన్ డెవలప్‌మెంట్'లో రోల్ మోడల్‌గా నిలిచాక అర్థమవుతుంది. 'అభివృద్ధి'ని ఎలా అర్థం చేసుకున్నారనే అంశం మీద మనం చేస్తున్న ఖర్చును నిర్వచించాల్సి ఉంటుంది. జీడీపీ (జాతీయ స్థూల ఉత్పత్తి) పెరిగి ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందిన సమయంలో ప్రజలు ఆకలి బాధతో అల్లాడిపోతే దాన్ని అభివృద్ధి అందామా?

ఏపీ సహా కోస్టల్ రాష్ట్రాలన్నీ తక్షణం స్పందించాలి

ఆంధ్రప్రదేశ్‌లో రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. అన్నదాతలకు అనుకూలమైన చాలా కార్యక్రమాలను అమలు చేస్తోంది. అయితే ఇప్పుడు దేశంలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్య వాతావరణ మార్పుల దుష్ప్రభావం. మనం తక్షణం స్పందించి వినూత్న విధానాలను రూపొందించి అమలు చేయడం అత్యావశ్యకం. ఆంధ్రప్రదేశ్ సహా కోస్టల్ రాష్ట్రాలన్నీ తక్షణం ఈ సమస్యపై దృష్టి సారించాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే వాతావరణ మార్పుల ప్రభావాన్ని అధిగమించడానికి ఏం చేయాలనే అంశంపై అధ్యయన బాధ్యతను యూనివర్సిటీలకు అప్పజెప్పాలి.

వైఎస్సార్ కార్యక్రమాలు వినూత్నం.. ముందడుగు వేసిన సీఎం జగన్

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వ్యవసాయ సంక్షోభం నుంచి రైతులను గట్టెక్కించడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించేందుకు జయతి ఘోష్ కమిటీని నియమించారు. రైతన్నలను ఆదుకునేందుకు వినూత్న, విభిన్న కార్యాచరణకు డాక్టర్ వైఎస్సార్ శ్రీకారం చుట్టారు. వైఎస్సార్ వారసత్వాన్ని అందుకొని ముందడుగు వేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులు ఎదుర్కొంటున్న తీవ్రమైన ఒత్తిడి నుంచి బయట పడేయటానికి చాలా చర్యలు చేపట్టారు. దేశంలో ఏ రాష్ట్రాల్లోనూ అమలు చేయని ఎన్నో కార్యక్రమాలను సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టింది. ఆర్బీకేల ఏర్పాటు మొదలు రైతు భరోసా వరకు అన్ని కార్యక్రమాలు, పథకాలు రైతులకు అనుకూలమైనవే. వాటిని మరింత కన్సాలిడేట్ చేయడం ప్రభుత్వం ముందున్న సవాల్.

మాది స్లోగన్ సర్కార్ కాదు.. సొల్యూషన్ సర్కార్

- కాంగ్రెస్, బీజేపీలు కేవలం నినాదాల పార్టీలు..
- బీఆర్ఎస్ మాత్రమే నినాదాలను నిజం చేసే పార్టీ
- నిమ్స్‌లో ఆయుష్ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు

లక్డీకాపూల్: మాది స్లోగన్ సర్కార్ కాదు.. సొల్యూషన్ సర్కార్ అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీజేపీలు కేవలం నినాదాల పార్టీలు .. బీఆర్ఎస్ మాత్రమే నినాదాలను నిజం చేసే పార్టీ అని పేర్కొన్నారు. గురువారం -నిమ్స్‌లో ఏర్పాటు చేసిన ఆయుష్ ఇంటిగ్రేటెడ్ వెల్‌నెస్ సెంటర్‌ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. నకిలీ హామీలు, వెకిలి చేష్టలతో ఆ రెండు పార్టీలు ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. అమిత్ షా, ఖర్గేలు పర్యాటకుల్లా వచ్చి.. అవగాహన లేమితో ఇక్కడి నేతలు రాసిచ్చిన స్క్రిప్ట్ చదివి వెళ్లిపోయారన్నారు. గుజరాత్లో బీజేపీ గుడ్డి పాలనను దారిలో పెట్టడం చేతగాని అమిత్ షా ఇక్కడికి వచ్చి అర్థం పర్థం లేని ఆరోపణలు చేసి వెళితే ఎవరు నమ్ముతారని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో మూడు నెలలకే కాంగ్రెస్ తీరేమిటో తేలిపోయిందని, ముందుగా ఖర్గే తన సొంత రాష్ట్రాన్ని చక్కదిద్ది ఇక్కడ కొచ్చి మాట్లాడాలని సూచించారు. వివిధ పార్టీల డిక్లరేషన్లు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని..బీఆర్ఎస్‌కు మూడోసారి అధికారం ఇవ్వాలని ఎప్పుడో సెల్ఫ్ డిక్లరేషన్ చేసుకున్నారని మంత్రి పేర్కొన్నారు.

నిమ్స్‌లో ఆయుష్ ఏర్పాటు రాష్ట్రంలోనే తొలిసారి

నిమ్స్‌లో ఆయుష్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందంటూ.. ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపిన సీఎస్ శాంతి కుమారికి హరీశ్‌రావు అభినందనలు తెలిపారు. ఈ తరహా వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసుకోవడం రాష్ట్రంలోనే తొలిసారన్నారు. ఆయుర్వేదం, యునాని, హోమియోపతి, సిద్ధ, ప్రకృతి వైద్యం.. అన్ని వైద్య విధానాలు ఇక్కడ ఒకే వేదికగా అందుబాటులో ఉంటాయని చెప్పారు. వికారాబాద్, భూపాలపల్లి, సిద్దిపేటల్లో 50 పడకల కొత్త ఆయుష్ ఆసుపత్రుల నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. వచ్చే నెల రెండో వారంలో మరో 9 మెడికల్ కాలేజీల్లో తరగతులు ప్రారంభం కానున్నాయని మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. దీంతో కొత్తగా 900 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వస్తాయని వివరించారు. త్వరలో మరో 8 మెడికల్ కాలేజీలు ప్రారంభించి.. ప్రతి జిల్లాకూ ఒక మెడికల్ కాలేజీ ఉన్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డ్ సృష్టించబోతుందని హరీశ్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీ నామా నాగేశ్వరరావు, నిమ్స్ సంచాలకులు నగరి బీరప్ప, ఆయుష్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ నేతలను తెలంగాణ జాతి నమ్మదు: హరీశ్

బీఆర్ఎస్‌లోకి ఎంఆర్‌పీఎస్ నేతల చేరిక

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్, బీజేపీ నాయకులను తెలంగాణ జాతి ఎన్నటికీ నమ్మదని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు యాతాకుల భాస్కర్ గురువారం తెలంగాణ భవన్‌లో హరీశ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎంపీ నామా నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రవీందర్‌రావు ఆధ్వర్యంలో చేరిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ పాలిస్తున్న రాష్ట్రాల్లో మత కలహాలు, కరెంటు, నీళ్ల కష్టాలతో కొట్టుమిట్టాడుతున్నాయని విమర్శించారు. అంబేడ్కర్ చూపిన మార్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పయనిస్తోందని, కాంగ్రెస్, బీజేపీలకు దళితులు, గిరిజనులపై ఏ మాత్రం ప్రేమలేదన్నారు. పార్టీలో చేరిన వారిలో ఎంఆర్‌పీఎస్ నాయకులు జే.ఆర్.కుమార్, శ్రీనివాసులు, సతీష్ ఉన్నారు.



హరీశ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న భాస్కర్. చిత్రంలో ఎంపీ నామా తదితరులు

రేపు ఆదిత్య-ఎల్1 ప్రయోగం



సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్‌లో సిద్ధంగా ఉన్న పీఎస్ఎల్‌వీ సీ57

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): సూర్యుడిపై పరిశోధనల నిమిత్తం 'ఇస్రో' శనివారం తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి పీఎస్ఎల్‌వీ సీ57 రాకెట్ ద్వారా ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని ప్రయోగించబోతోంది. రెండో ప్రయోగ వేదిక నుంచి శనివారం ఉదయం 11.50 గంటలకు ఈ ప్రయోగాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం శుక్రవారం ఉదయం 11.50 గంటలకు కౌంట్‌డౌన్ ప్రక్రియ ప్రారంభించనున్నారు. గురువారం షార్‌లోని బ్రహ్మప్రకాష్‌హాలులో మిషన్ సంసిద్ధత సమావేశం నిర్వహించారు. పీఎస్ఎల్‌వీ సీ57 రాకెట్‌కు అన్ని పరీక్షలు నిర్వహించి లాంచ్ ఆథరైజేషన్ బోర్డు(ల్యాబ్)కు అప్పగించారు. ల్యాబ్ చైర్మన్ రాజరాజన్ రాకెట్‌కు మరోసారి పరీక్షలు నిర్వహించి.. కౌంట్‌డౌన్, ప్రయోగ సమయాన్ని అధికారికంగా ప్రకటించారు. సూర్యుడు ఒక మండే అగ్నిగోళం.. అక్కడికి ఉపగ్రహాన్ని పంపిస్తే కాలిపోతుంది కదా.. అనే అనుమానం చాలా మందిలో ఉంటుంది. వాస్తవానికి ఈ ప్రయోగంలో భూమి నుంచి సూర్యుడి దిశగా 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న లాంగ్రేజియన్ బిందువు-1(ఎల్-1) చుట్టూ ఉన్న కక్ష్యలోకి దాదాపు 1,470 కిలోల బరువున్న ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టనున్నారు. దీనివల్ల గ్రహణాలతో సంబంధం లేకుండా సౌరగోళంపై నిరంతరం అధ్యయనం చేసేందుకు అవకాశం లభిస్తుంది.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- సిఫారసు లేఖలకు అనుమతి లేదు, ప్రివిలేజ్డ్ దర్శనాలు రద్దు
- 18న సీఎం పట్టువస్త్రాల సమర్పణ
- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి

తిరుమల: అధికమాసం కారణంగా ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో జరిగే రెండు బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో గురువారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 18 నుంచి 26వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 15 నుంచి 23 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. సెప్టెంబర్ 18న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని వెల్లడించారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు జరుగుతాయన్నారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తామని, వారికి సంతృప్తికరంగా వాహనసేవల దర్శనంతోపాటు మూలమూర్తి దర్శనం కల్పిస్తామని చెప్పారు. బ్రేక్ దర్శనాలకు సిఫారసు లేఖలు స్వీకరించమని, స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులను మాత్రమే అనుమతిస్తామని వివరించారు. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు తదితర ప్రివిలేజ్డ్ దర్శనాలను రద్దు చేసినట్టు వెల్లడించారు. శ్రీవాణి ట్రస్టు నిధులతో ఆలయాలు నిర్మించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకార ప్రాంతాల్లోని భక్తులకు రోజుకు వెయ్యి మంది చొప్పున బ్రహ్మోత్సవ దర్శనం చేయిస్తామని తెలిపారు. భక్తుల భద్రత దృష్ట్యా సెప్టెంబరు 22న గరుడసేవ నాడు ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాల రాకపోకలు రద్దు చేస్తామన్నారు.

నేటి నుంచి ఖమ్మంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

ఖమ్మం స్పోర్ట్స్: సైన్యంలో నియామకాల కోసం అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ శుక్రవారం నుంచి ఖమ్మం జిల్లాకేంద్రంలో జరగనుంది. సర్దార్ పటేల్ స్టేడియంలో ఎనిమిది రోజులపాటు సాగే ర్యాలీలో రాష్ట్రవ్యాప్తంగా రాతపరీక్షలో అర్హత సాధించిన 7,397 మంది అభ్యర్థులకు ఫిజికల్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఇందుకోసం స్టేడియంలో చేసిన ఏర్పాట్లను కలెక్టర్ వీపీ గౌతమ్, కల్నల్ కీట్స్‌దాస్ గురువారం పర్యవేక్షించారు. మొదటిదశ పరీక్షలో ఉత్తీర్ణులైనవారు అడ్మిట్ కార్డుతోపాటు కావాల్సిన సర్టిఫికెట్లు తీసుకుని నిర్ణీత తేదీలోనే రావాలని సూచించారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే అభ్యర్థుల కోసం ఖమ్మం రైల్వేస్టేషన్, బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

జూరాలకు ఇన్‌ఫ్లో నిల్

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లోలు పూర్తిగా తగ్గినట్లు పీజేపీ అధికారులు చెప్పారు. కాగా నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో ఒక పంపు ద్వారా 750 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 117 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1 ద్వారా 650 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, జూరాల ఎడమ కాల్వ ద్వారా 975 క్యూసెక్కులు, కుడి కాల్వకు 690 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 80 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 700 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 4,197 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 6.187 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో గురువారం సాయంత్రం నాటికి ప్రాజెక్టులో నీటిమట్టం 1,020 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 975 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా సమాంతర కాల్వ ద్వారా 700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 950 క్యూసెక్కులు కుడి, ఎడమ, కాల్వ ద్వారా 65 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. రాజీవ్ భీమా-2 ద్వారా 851 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనీల్ రెడ్డి తెలిపారు.

శ్రీశైలంలో 852.6 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో గురువారం 852.6 అడుగుల వద్ద 85.9318 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డి పాడు ద్వారా 3,000, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 490, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,848, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 7.916 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 15,499 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదిలారు.

ముస్తాబవుతున్న వాలీబాల్ అకాడమీ



వాలీబాల్ అకాడమీ కోర్టులు

- త్వరలో ప్రవేశాలు కల్పించే అవకాశం
- అకాడమీకి చేరిన క్రీడాకారుల వసతి సౌకర్యాలు
- గతేడాది డిసెంబర్ 1న ఎంపికలు పూర్తి

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృషితో గతంలో జిల్లాస్టేడియంలో ఉన్న వాలీబాల్ అకాడమీ తిరిగి ఏర్పాటైంది. రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్ జిల్లాకు క్రీడల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ముఖ్యంగా వాలీబాల్ క్రీడల్లో జిల్లా జట్టు రాష్ట్రంలో ఎక్కడ టోర్నీ జరిగినా సత్తా చాటేవారు. 2004లో రాష్ట్ర క్రీడాప్రాధికారిక సంస్థ జిల్లాకు వాలీబాల్ అకాడమీ మంజూరు చేసింది. అకాడమీ నడిచిన నాలుగేళ్లలో జిల్లా క్రీడాకారులు ఎంతో ప్రతిభ కనబరిచేవారు. వాలీబాల్ అకాడమీలో శిక్షణ పొందిన జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడాకారులుగా ఎదిగారు. అయితే నిధుల నిర్వహణ భారంతో 2008 సంవత్సరంలో వాలీబాల్ అకాడమీని మూసివేశారు.



అకాడమీ క్రీడాకారుల వసతి సౌకర్యాలు

మంత్రి చొరవతో అకాడమీ ఏర్పాటు

మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చొరవతో జిల్లా కేంద్రంలో మళ్లీ వాలీబాల్ అకాడమీ తిరిగి ఏర్పాటైంది. రూ.19.70 లక్షల నిధులతో వాలీబాల్ అకాడమీ పనులు చేపట్టారు. స్టేడియం ఆవరణలో గల స్విమ్మింగ్‌పూల్‌లోని అంతస్తుల గదులను అకాడమీ క్రీడాకారుల వసతి కోసం కేటాయించారు. ఈ నిధులతో గదుల ఆధునికీకరణ పనులు చేపట్టారు. స్టేడియంలోని రెండు పాత వాలీబాల్ కోర్టులను తీసివేసి వాటి స్థానంలో నూతన కోర్టులు ఏర్పాటు చేశారు. కోర్టుల చుట్టూ నాలుగు ఫ్లడ్‌లైట్లు, ప్రత్యేక షెడ్లు, గ్యాలరీ ఏర్పాటు చేశారు. వాలీబాల్ అకాడమీ ఏర్పాటుతో ఔత్సాహిక క్రీడాకారులకు మహర్దశ ఏర్పడనుంది. బాలబాలికలకు నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో వాలీబాల్‌లో మెరుగైన శిక్షణ అందజేసి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచేలా క్రీడాకారులను తీర్చిదిద్దుతారు. అకాడమీకి ఎంపికైన వారికి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక వాలీబాల్ శిక్షణ అందజేస్తారు. క్రీడాకారులకు ప్రత్యేకంగా బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తారు.

వారం రోజుల్లో క్రీడా సామగ్రి



మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృషితో మెయిన్ స్టేడియంలో వాలీబాల్ అకాడమీ ఏర్పాటయింది. అకాడమీ ఏర్పాటుతో నైపుణ్యం గల వాలీబాల్ క్రీడాకారులను వెలికితీయవచ్చు. ఇప్పటికే క్రీడాకారులకు కొన్ని వసతులు ఏర్పాటు చేశాం. వారం రోజుల్లో క్రీడాసామగ్రి వస్తాయి. శాట్ ఆదేశాల మేరకు ఎంపికైన క్రీడాకారులకు త్వరలో అకాడమీలో ప్రవేశాలు కల్పిస్తాం.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్ఓ, మహబూబ్‌నగర్

➪ జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఏర్పాటు చేసిన నూతన వాలీబాల్ అకాడమీలో ప్రవేశాల కోసం గత ఏడాది డిసెంబర్ 1వ తేదీన రాష్ట్రంలోని బాలబాలికలకు సెలక్షన్స్ నిర్వహించారు. అండర్ 14–18 ఏళ్ల మధ్య వయస్సు బాలబాలికలకు ఎంపికలు నిర్వహించారు. ఇప్పటికే అకాడమీకి క్రీడాకారుల వసతి సౌకర్యాలు చేరాయి. మంచాలు, డెస్క్‌లతో పాటు ఇతర వస్తువులు ఏర్పాటు చేశారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: అన్నా చెల్లెల అనుబంధానికి, అనురాగానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలను ప్రజలు గురువారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. రాఖీ పౌర్ణమికి రెండు రోజుల ముందే దూర ప్రాంతాల నుంచి సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టేందుకు పుట్టిళ్లకు చేరుకున్నారు. మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి వేడుకలు జరుపుకున్నారు. హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ఆయన చెల్లెలు శ్రీదేవి రాఖీ కట్టారు. ఏనుగొండలోని రెడ్‌క్రాస్ అనాథశరణాలయంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించి పిల్లల చేత రాఖీలు కట్టించారు. అనంతరం పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ విభాగ్ సంయోజక్ సురేష్ పాల్గొన్నారు.



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కి రాఖీ కడుతున్న చెల్లెలు శ్రీదేవి

వర్షాలు కురవాలని.. మేఘునికి రాఖీ

సాధారణంగా అక్కాచెల్లెళ్లు.. తమ అన్నాతమ్ముళ్లకు రాఖీలు కట్టి ఆప్యాయతను చాటుకుంటారు.. కానీ, ప్రస్తుతం నెలకొన్న తీవ్రమైన వర్షాభావ పరిస్థితులతో చలించిన ఓ మహిళా రైతు.. గురువారం రాఖీ పండుగ సందర్భంగా మేఘునికి రాఖీ కట్టి.. వర్షాలు సమృద్ధిగా కురిపించాలని వేడుకుంది. మండలంలోని బిజ్వార్‌లో చోటుచేసుకున్న ఈ సంఘటన వినూత్నంగా అనిపించినా.. అందరినీ ఆలోచింపజేసింది.

– ఊట్కూరు



కల్యాణ వైభోగమే



స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి నెలా పౌర్ణమి రోజు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గర్భగుడి నుంచిస్వామివారిని ఊరేగింపుగా కల్యాణ మంటపం వరకు తీసుకువచ్చారు. అనంతరం స్వామివారి కల్యాణ వేడుకను సంప్రదాయపద్ధతిలో భక్తుల నామస్మరణ భద్య నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారితో పాటు పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.



శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారికి హారతి ఇస్తున్న చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్

పాలమూరు 637/8

- టూ డేగ్ లీగ్‌లో భారీ స్కోర్
- డేవిడ్ క్రిపాల్ డబుల్ సెంచరీ, రాఫే సెంచరీ



డేవిడ్ క్రిపాల్ (201 పరుగులు)



అబ్దుల్ రాఫే (156 పరుగులు)

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో హెచ్‌సీఏ టూడే లీగ్ చాంపియన్‌షిప్‌లో గురువారం జిల్లా జట్టు వెస్ట్‌మారెడ్‌పల్లి జట్టుపై భారీ స్కోర్ చేసింది. మొదటి రోజు తొలుత బ్యాటింగ్ చేసిన ఎండీసీఏ జట్టు నిర్ణీత 90 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 637 పరుగులు చేసింది. జట్టులో డేవిడ్ క్రిపాల్ డబుల్ సెంచరీతో రాణించాడు. 119 బంతుల్లో 24 ఫోర్లు, 7 సిక్స్‌లతో 201 పరుగులు చేశాడు. అబ్దుల్ రాఫే బిన్ అబ్దుల్లా 156 పరుగులు (197 బంతుల్లో 23 ఫోర్లు, 1 సిక్స్) పరుగులు, ఎ.శ్రీకాంత్ (69), హర్షవర్ధన్ (64), అరవింద్ (53), షాదాబ్ (52) పరుగులు చేశారు. శుక్రవారం రెండో రోజు మ్యాచ్ కొనసాగనుంది.

అర్హులకు సంక్షేమ ఫలాలు అందాలి

న్యాయమూర్తి సంధ్యారాణి

పాలమూరు: పేదల కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి అన్నారు. జిల్లాకేంద్రంలోని కోర్టు ఆవరణలోని న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయంలో గురువారం పానెల్ న్యాయవాదులు, ప్యారా లీగల్ వలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో చట్టాలపై అవగాహన కలిగించడంతో పాటు ప్రభుత్వ పథకాల తీరుపై దృష్టిసారించాలన్నారు. పేదల కోసం ఇస్తున్న గృహలక్ష్మీ, అంగన్‌వాడీల ద్వారా ఇస్తున్న మాతా శిశు అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించాలన్నారు. నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాల్సిన అవసరం చాలా ఉందని పేర్కొన్నారు.